ప్రజా సంక్షేమమే ధ్యేయం..



3 లో..

www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

భోక్తిశోభల్లో నాగోబా చెంతకు మేడారం



3 లో..

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 286, శనివారం 14-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు

- *భారత్ సమ్మిట్‌తో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు*
- *సుమారు 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం*
- *పెట్టుబడులు, పర్యావరణం, మానవ వనరులపై చర్చలు*
- *దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానం తీసుకొచ్చాం: సీఎం రేవంత్‌రెడ్డి*



హైదరాబాద్, నవంబర్ 13

తెలంగాణలో ఉన్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ 2026 సందర్భంగా బోధి పెవిలియన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, కేంద్ర మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అంతర్జాతీయ స్థాయిలో వివరించేందుకు భారత్ సమ్మిట్ వేదికగా నిలుస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. గతేడాది కూడా భారత్ సమ్మిట్ నిర్వహించామని, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు సాగుతోందని చెప్పారు. ఈసారి దాదాపు 70 దేశాలకు చెందిన వివిధ రంగాల నిపుణులు, మంత్రులు, పర్యావరణవేత్తలు, పెట్టుబడిదారులు, పాత్రికేయులు సహా సుమారు వెయ్యి

మిగతా 2 లో..



పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- **రైతులకు ఇబ్బందులు లేకుండా పక్కా ప్రణాళిక : మంత్రి**
- **అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్య పెంపు**
- **కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా చర్యలు**
- **వచ్చే సీజన్ పంటల సాగుపై రైతులకు అవగాహన**

నల్లగొండ, నవంబర్ 13

: జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను రాబోయే పది రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ధాన్యం సేకరణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. జిల్లాలో ఈసారి ధాన్యం ఉత్పత్తి భారీగా పెరిగిన నేపథ్యంలో కొనుగోళ్లలో ఎలాంటి జాప్యం జరగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రైతులు తమ పంటను విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు పడకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ధాన్యం సేకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించిన గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ధాన్యం ఉత్పత్తి అధికంగా ఉన్న ప్రాంతాల్లో అవసరాన్ని బట్టి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని మంత్రి తెలిపారు. కేంద్రాల్లో రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ధాన్యం సేకరణలో ఎక్కడా జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రైతులు రోజుల తరబడి

మిగతా 2 లో..

ట్రక్ పార్క్ భూముల

వేలాన్ని అడ్డుకుంటాం

- *మూసాపేటలో స్థలాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల బృందం*
- *స్థానికులు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో చర్చ*
- *ప్రజా అవసరాల భూములను ఎలా అమ్ముతారంటూ ప్రభుత్వంపై ప్రశ్నలు*
- *స్థానికులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని హరీశ్ రావు భరోసా*

హైదరాబాద్, నవంబర్ 13



కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేటలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ భూములను ప్రభుత్వం వేలం వేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆందోళన చేపట్టింది. శుక్రవారం మాజీ మంత్రి హరీశ్ రావు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ట్రక్ పార్క్ స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములను వేలం వేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక పరిస్థితులను పరిశీలించి భూముల వినియోగం, వేలం ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

అనంతరం స్థానిక ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికులతో హరీశ్ రావు మాట్లాడారు. ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనతో ఎదురవుతున్న సమస్యలు,

మిగతా 2 లో..

మినీ రిజర్వాయర్‌గా ఫాక్స్ సాగర్

- *పునరుద్ధరణ పనులు ప్రారంభం*
- *చెరువుకు కొత్త రూపు తీసుకొచ్చేందుకు హైడ్రా చర్యలు*
- *ఐదు మీటర్ల మేర పూడిక తొలగింపునకు ప్రణాళిక*
- *వెయ్యి నుంచి నాలుగు వేల మిలియన్ లీటర్లకు సామర్థ్యం పెంపు*
- *మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్*

హైదరాబాద్, నవంబర్ 13



మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా జీడిమెట్ల ప్రాంతంలోని చారిత్రక ఫాక్స్ సాగర్ చెరువు పునరుద్ధరణ పనులకు హైడ్రా శ్రీకారం చుట్టింది. ఆక్రమణలు తొలగించడంతో పాటు మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలతో దుర్గంధభరితంగా మారిన చెరువుకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. శుక్రవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. చెరువును మినీ రిజర్వాయర్ తరహాలో అభివృద్ధి చేయడంతో పాటు మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. ఏడాది కాలంలో ఫాక్స్ సాగర్ రూపురేఖలు పూర్తిగా మారి అందమైన సరస్సుగా కనిపిస్తుందని వెల్లడించారు.

ఒకప్పుడు సాగునీరు, తాగునీటి అవసరాలు తీర్చిన ఈ చెరువు ప్రస్తుతం మురుగునీరు, ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలు, గుర్రపుడెక్కతో తీవ్రంగా దెబ్బతిన్నదని రంగనాథ్ తెలిపారు. పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు తగ్గిపోవడమే కాకుండా, కలుషిత నీటి కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని వివరించారు. ఈ పరిస్థితులను మార్చేందుకు చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, శుద్ధి చేసిన నీటితో నింపేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. గతంలో మాదాపూర్‌లోని తమ్మిడికుంటను హైడ్రా అభివృద్ధి చేసిన తరహాలోనే ఫాక్స్ సాగర్‌ను కూడా సుందరంగా

మిగతా 2 లో..

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్ బాధ్యతలు

హైదరాబాద్, నవంబర్ 13

- బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీలో బాధ్యతలు చేపట్టిన ఐపీఎస్ అధికారి
- శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం
- మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- అవినీతిపై జీరో టాలరెన్స్ విధానమే లక్ష్యం



హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా ఐపీఎస్ అధికారి డాక్టర్ మహేశ్ మురళీధర్ భగవత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పోలీసు శాఖలోని కీలక అంశాలు, నగరంలో శాంతిభద్రతల పరిస్థితి, ప్రజలకు అందిస్తున్న పోలీసు సేవలపై ఆయన దృష్టి సారించారు. నగర పోలీసు వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు తన ప్రాధాన్యతలను వెల్లడించారు.

నగరంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని మహేశ్ మురళీధర్ భగవత్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడం, నేరాలను నియంత్రించడం, శాంతిభద్రతలను కాపాడటం తమ ప్రధాన బాధ్యతలని పేర్కొన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు నగరంలో

మిగతా 2 లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
శనివారం
14 । నవంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా మహేశ్ మురళీధర్ భగవత్ బాధ్యతలు

(మొదటి పేజీ తరువాయి)

ఎదురవుతున్న సమస్యలను సమర్థంగా పరిష్కరించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగనున్నట్లు తెలిపారు. మహిళల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు నూతన కమిషనర్ వెల్లడించారు. మహిళలు నిర్భయంగా నగరంలో ప్రయాణించేలా, పని ప్రదేశాలు, బహిరంగ ప్రాంతాల్లో సురక్షిత వాతావరణం ఉండేలా పోలీసు చర్యలను బలోపేతం చేయడం తమ ప్రాధాన్యతల్లో ఒకటిగా పేర్కొన్నారు. అదే సమయంలో సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. సాంకేతికతను ఉపయోగించుకుని మోసాలకు పాల్పడుతున్న నేరగాళ్లను అడ్డుకోవడం, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ నేపథ్యంలో ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం కూడా తన ప్రధాన ప్రాధాన్యతల్లో ఒకటని మహేశ్ మురళీధర్ భగవత్ పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, రహదారులపై వాహనాల రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవడంపై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసు వ్యవస్థను రూపొందించడంతో పాటు పౌరుల సమస్యలకు వేగంగా స్పందించే విధంగా సేవలను మరింత మెరుగుపరచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అవినీతికి ఏమాత్రం తావు లేకుండా జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగరంలోని సీనియర్ పోలీసు అధికారులతో మహేశ్ మురళీధర్ భగవత్ సమావేశమయ్యారు. నగర పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం, ప్రస్తుతం ఎదురవుతున్న ప్రధాన సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలపై అధికారులతో చర్చించారు. వివిధ విభాగాల పనితీరు, సమన్వయం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సమీక్షించారు. శాంతిభద్రతలు, మహిళల భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ వంటి కీలక అంశాల్లో సమర్థవంతమైన చర్యలతో ముందుకు సాగాలని నిర్ణయించారు.

భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రపంచస్థాయి గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు వెల్లడించారు.

రెండు రోజులపాటు వివిధ అంశాలపై సదస్సులు, చర్చలు నిర్వహించి తీర్మానాలు చేయనున్నట్లు రేవంత్‌రెడ్డి వివరించారు. తెలంగాణలో ప్రజాస్వామిక వాతావరణం, పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఉన్నాయనే విషయాన్ని ఈ వేదిక ద్వారా ప్రపంచానికి తెలియజేయాలనుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణం వంటి అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకుంటారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలకు పరిష్కారాలు కనుగొనాలని, వివిధ అభిప్రాయాల్లో అత్యుత్తమ విధానాలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు తిరిగి వెళ్లిన తర్వాత తెలంగాణకు ప్రచారకర్తలుగా మారుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశవ్యాప్తంగా గిగ్, వేదిక ఆధారిత కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వారికి తగిన రక్షణ లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ గిగ్ కార్మికుల విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ విధానాన్ని ఆవిష్కరించే కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. రెండు రోజుల భారత్ సమ్మిట్‌లోనూ రాహుల్ గాంధీ తన సందేశాన్ని వినిపిస్తారని చెప్పారు. ఢిల్లీలో నిర్వహించిన తెలంగాణ ప్రపంచ పెట్టుబడుల సదస్సు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించిన విషయాన్ని కూడా గుర్తుచేశారు. సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచడం, రాష్ట్రంలోని అవకాశాలను ప్రపంచానికి తెలియజేయడం వంటి లక్ష్యాలతో పెట్టుబడుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాంస్కృతికంగా, సాంకేతికంగా హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని పరిచయం చేస్తూ మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలకు అడ్డుపడకుండా సహకరించాలని కోరారు.

ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకుంటాం

(మొదటి పేజీ తరువాయి)

తమకు కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ట్రక్ పార్క్ అందుబాటులో లేకపోతే డ్రైవర్లు, కార్మికులు ఎదుర్కొనే సమస్యలను ఆయనకు వివరించారు. స్థానికుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న హరీశ్ రావు ట్రక్ పార్క్ భూముల వేలాన్ని కచ్చితంగా అడ్డుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయంలో స్థానిక ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను వేలం వేయడంపై ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

స్థల పరిశీలన అనంతరం అక్కడ నిర్వహించిన ధర్నాలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ట్రక్ పార్క్ భూముల వేలం ప్రతిపాదనపై తమ అభ్యంతరాలను వెల్లడించారు. ప్రజలు, ట్రక్ డ్రైవర్లు, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. స్థానికుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు రాజు శంభీపూర్, నవీన్ కుమార్‌తో పాటు సీపీఐ, సీపీఎం నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రజా అవసరాల కోసం కేటాయించిన ట్రక్ పార్క్ స్థలాన్ని కాపాడాలనే డిమాండ్‌తో నిర్వహించిన ఈ ఆందోళనలో స్థానికులు కూడా పాల్గొన్నారు.

పాదయాత్రలో రోడ్డు ప్రమాదంపై తీన్మార్ మల్లన్న ఫిర్యాదు





- **డీజీపీని కలిసి సమగ్ర దర్యాప్తు కోరిన ఎమ్మెల్సీ**
- **లారీ ఢీకొట్టిన ఘటనపై అనుమానాలు వ్యక్తం**
- **ఉద్దేశపూర్వక దాడి కోణంలోనూ విచారణ జరపాలని విజ్ఞప్తి**
- **సీసీటీవీ, ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని కోరిన నేత**

హైదరాబాద్, నవంబర్ 13

: బీసీ రాజ్యాధికార పాదయాత్రలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంపై తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అన్నాజీపురం-తిరుమలగిరి రోడ్డు సమీపంలో జరిగిన ఈ ఘటన అనుమానాస్పదంగా ఉందని, దీనిపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. తనతో పాటు పాదయాత్రలో పాల్గొంటున్న వారి భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ డీజీపీకి వినతిపత్రం అందజేశారు.

వలిగొండ నుంచి తొర్రూరు జాతీయ రహదారి వైపు పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో వేగంగా వచ్చిన లారీ తన వాహనంతో పాటు మరో కారును బలంగా ఢీకొట్టిందని తీన్మార్ మల్లన్న ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తన సిబ్బందితో పాటు మరో వాహనంలో ప్రయాణిస్తున్న పలువురికి గాయాలయ్యాయని తెలిపారు. ప్రమాదం జరిగిన తీరు, పరిస్థితులు అనుమానాలకు తావిస్తున్నాయని, తన రాజకీయ కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్న కొందరు వ్యక్తులు బీసీల రాజకీయ సాధికారత కోసం చేపట్టిన ఉద్యమాన్ని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. తనకు హాని కలిగించాలనే కుట్ర జరిగిందా అనే కోణంలోనూ విచారణ జరపాలని కోరారు.

ఈ ఘటనపై తక్షణమే తగిన చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు. దర్యాప్తు బాధ్యతలను డీఎస్పీ స్థాయికి తగ్గకుండా సీనియర్ పోలీసు అధికారికి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ యజమాని, డ్రైవర్ వివరాలు, వాహన రిజిస్ట్రేషన్, యాజమాన్య సమాచారం, డ్రైవర్ ఉద్యోగ సంబంధాలు, గతంలో ఆ వాహనం ప్రయాణించిన మార్గాలపై విచారణ జరపాలని సూచించారు. తనను లక్ష్యంగా చేసుకునేందుకు ఎవరైనా లారీని లేదా డ్రైవర్‌ను ఉపయోగించారా అనే విషయాన్ని నిర్ధారించాలని కోరారు. ప్రమాద ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలు, జాతీయ రహదారి నిఘా కెమెరాల రికార్డులు, సమీపంలోని వ్యాపార సంస్థలు, భవనాల్లోని కెమెరాల దృశ్యాలు, మొబైల్ ఫోన్ వీడియోలు, కాల్ రికార్డులు సహా ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను వెంటనే భద్రపరచాలని తీన్మార్ మల్లన్న కోరారు. ముందస్తుగా తనపై నిఘా పెట్టారా, రాజకీయ శత్రుత్వం కారణంగా ఈ ఘటన జరిగిందా, పాదయాత్రను అడ్డుకోవడానికి లేదా అందులో పాల్గొంటున్న వారికి హాని కలిగించడానికి ఎవరైనా ప్రయత్నించారా అనే అంశాలను కూడా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

బీసీలకు రాజకీయ, సామాజిక, రాజ్యాంగబద్ధమైన హక్కులు, తగిన ప్రాతినిధ్యం కల్పించాలనే ప్రజాస్వామ్య లక్ష్యంతోనే పాదయాత్ర చేపట్టినట్లు తీన్మార్ మల్లన్న తెలిపారు. ఉద్యమంలో పాల్గొంటున్న వారిని బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం లేదా శారీరకంగా హాని కలిగించే ప్రయత్నాలు చేయడం తీవ్రమైన విషయమన్నారు. చట్టంపై, తెలంగాణ పోలీసుల నిష్పక్షపాత పనితీరుపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, డీజీపీ వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఆధారాలు నాశనం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీకుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బంధారపు నర్సయ్య గౌడ్ పాల్గొన్నారు.

పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే సీజన్‌లో చేపట్టాల్సిన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక, సాగు ప్రణాళికపై రైతులకు అవసరమైన సమాచారం అందించాలని సూచించారు. రైతులకు సరైన మార్గనిర్దేశం చేయడం ద్వారా సాగులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించేందుకు కృషి చేయాలని చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నల్లగొండ మేయర్ బుర్రి వైతన్య శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మినీ రిజర్వాయర్‌గా ఫాక్స్ సాగర్

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.

ఫాక్స్ సాగర్‌లో సుమారు ఐదు మీటర్ల మేర పూడిక తొలగించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ వెల్లడించారు. ప్రస్తుతం సుమారు వెయ్యి మిలియన్ లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం మాత్రమే ఉన్న చెరువును నాలుగు వేల మిలియన్ లీటర్ల సామర్థ్యానికి పెంచడం లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పూడిక తొలగింపు ద్వారా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అభివృద్ధి పనులకు ముందు, తర్వాత చెరువులోని నీటితో పాటు పరిసర ప్రాంతాల్లోని భూగర్భ జలాలను జాతీయ పర్యావరణ ఇంజనీరింగ్ పరిశోధనా సంస్థ ద్వారా పరీక్షించనున్నట్లు వివరించారు. మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నేరుగా చెరువులోకి చేరకుండా మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

చెరువులోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరద ముప్పును నివారించేందుకు ప్రత్యేక నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు రంగనాథ్ తెలిపారు. 2000 సంవత్సరంలో వరదల సమయంలో ఎదురైన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ వ్యవస్థను పటిష్టం చేస్తామన్నారు. చెరువు కట్టను బలోపేతం చేయడంతో పాటు నీరు చేరే మార్గాలు, బయటకు వెళ్లే మార్గాలను సక్రమంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. చెరువు చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచడంతో పాటు వరద నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడటమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఫాక్స్ సాగర్‌కు చారిత్రక ప్రాధాన్యం ఉందని, 1897లో నిజాం పాలకుల కాలంలో దీనిని నిర్మించినట్లు చరిత్ర చెబుతోందని రంగనాథ్ పేర్కొన్నారు. సాగునీటి అవసరాలతో పాటు సికింద్రాబాద్ ప్రజలకు తాగునీరు అందించేందుకు ఈ చెరువును నిర్మించారని తెలిపారు. చెరువు నీరు నేరుగా హుస్సేన్‌సాగర్‌కు చేరేలా గతంలో వరద కాలువలు ఉండేవని, చెరువు కట్టపై నిర్మించిన పురాతన రాతి పంప్‌హౌస్ ద్వారా తాగునీటి సరఫరా జరిగేదని వివరించారు. ప్రస్తుతం దెబ్బతిన్న ఈ పంప్‌హౌస్‌ను పునరుద్ధరించేందుకు యూరప్‌కు చెందిన నిపుణుల సహకారం తీసుకోనున్నట్లు చెప్పారు. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులో 150 ఎకరాల మేర ఆక్రమణలను గుర్తించామని, వాటిలో చాలావరకు ఇప్పటికే తొలగించినట్లు వెల్లడించారు. 2024 జూలై 19న హైడ్రా ఏర్పాటుకు ముందే ఉన్న నివాస గృహాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తొలగించబోమని స్పష్టం చేశారు. భూములు, ప్లాట్లు కోల్పోయే వారికి నిబంధనల ప్రకారం బదిలీ చేయదగిన అభివృద్ధి హక్కులు (టీడీఆర్) కల్పిస్తామని తెలిపారు. చెరువు ప్రధాన కట్ట, పరిసర ప్రాంతాల భద్రత కోసం పది మీటర్ల బఫర్ జోన్‌ను పరిగణనలోకి తీసుకుంటామని, కట్ట దిగువన ఉన్న ఆలయాలు, ఇతర నిర్మాణాల విషయంలోనూ వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు చేపడతామని హైడ్రా కమిషనర్ వెల్లడించారు.

రబీ పంటల ప్రణాళికపై కలెక్టర్లతో సీఎస్ సమీక్ష



- **వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి**
- **వ్యవసాయం, ఉద్యానవన శాఖల పనితీరుపై చర్చ**
- **వరి ధాన్యం సేకరణ, భూసేకరణ అంశాలపై సమీక్ష**
- **పాఠశాల విద్యా రంగ పరిస్థితులపైనా ఆరా**

హైదరాబాద్, నవంబర్ 13

: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి నిర్వహించిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సమీక్ష చేపట్టారు. జిల్లాల వారీగా ప్రభుత్వ శాఖల పనితీరు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల అమలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న పరిస్థితులపై కలెక్టర్లతో చర్చించారు.

వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రధానంగా సమీక్ష నిర్వహించారు. రబీ పంటల సాగు ప్రణాళిక, రైతులకు అవసరమైన ఏర్పాట్లు, వ్యవసాయ కార్యకలాపాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో పంటల సాగుకు సంబంధించి చేపడుతున్న చర్యలు, వ్యవసాయ శాఖ ద్వారా అందుతున్న సేవలపై చర్చించారు. ఉద్యానవన శాఖకు సంబంధించిన కార్యక్రమాల పురోగతిని కూడా సీఎస్ సమీక్షించారు. ఉద్యాన పంటల సాగు, సంబంధిత శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్ల నుంచి వివరాలు సేకరించారు. రబీ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన రంగాలకు సంబంధించిన ప్రణాళికల అమలుపై దృష్టి సారించారు.

వరి ధాన్యం సేకరణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జిల్లాల్లో జరుగుతున్న ఏర్పాట్లు, సంబంధిత అంశాలపై సమీక్షించారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు. భూసేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్లతో చర్చించి వివరాలు సమీక్షించారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన అంశాలపైనా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో విద్యా రంగ పరిస్థితులు, పాఠశాలలకు సంబంధించిన కార్యక్రమాల అమలుపై కలెక్టర్లతో చర్చించారు. వ్యవసాయం, ఉద్యానవనం, ధాన్యం సేకరణ, భూసేకరణ, పాఠశాల విద్య వంటి కీలక రంగాలపై నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి పరిస్థితులను సమీక్షించారు.

న్యాయ విద్యతోనే ఆదివాసీ చట్టాల అమలు సాధ్యం

- భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటు చేయాలి

- ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని GSP రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయిదొర డిమాండ్



వెంకటాపురం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్): ఆదివాసీల హక్కులు, చట్టాలపై పూర్తి అవగాహన కల్పించి, రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలంటే న్యాయ విద్య ఎంతో అవసరమని గోండ్వానా సంక్షేమ పరిషత్ (GSP) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనెం సాయిదొర అన్నారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీ చట్టాల సమర్థవంతమైన అమలు కోసం భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని, ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకటాపురం మండలంలోని కొమరం భీమ్ కాలనీలో తాటి రాజేష్ అధ్యక్షతన నిర్వహించిన గోండ్వానా సంక్షేమ పరిషత్ సమావేశానికి పూనెం సాయిదొర ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి నేటి వరకు ఆదివాసీలు చట్టాలు, న్యాయస్థానాలపై సరైన అవగాహన లేక చారిత్రక అన్యాయాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా ఆదివాసీలు తమ భూమి, అడవి, జల వనరులపై హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని తెలిపారు. వారి పోరాటాల ఫలితంగా అనేక చట్టాలు వచ్చినప్పటికీ, వాటిని ఎలా అమలు చేయించుకోవాలో తెలియకపోవడంతో ఆ చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని విమర్శించారు. ఆదివాసీల భూములను గిరిజనేతరులు ఆక్రమించినప్పుడు న్యాయం కోసం న్యాయస్థానాలను ఆశ్రయించే అవగాహన లేకపోవడం విచారకరమన్నారు. కోనేరు రంగారావు కమిషన్ నివేదిక ప్రకారం సుమారు 8 లక్షల ఎకరాల ఆదివాసీ భూమి అన్యాక్రాంతమైనట్లు పేర్కొంటూ, ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ఆదివాసీలకు న్యాయపరమైన అవగాహన అవసరమని తెలిపారు. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ఆదివాసీల రక్షణ కోసం అనేక ప్రత్యేక చట్టాలను కల్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో వాటి అమలు ఆశించిన స్థాయిలో లేదని అన్నారు. ఆదివాసీ ఉప ప్రణాళిక పేరుతో వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులు ఏజెన్సీ గ్రామాల అభివృద్ధికి పూర్తిస్థాయిలో చేరడం లేదని విమర్శించారు. నిధుల వినియోగంపై ప్రశ్నించే చైతన్యం ఆదివాసీ యువతలో పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విద్యతో పాటు న్యాయపరమైన అవగాహన పెంపొందించుకోవాలని పూనెం సాయిదొర పిలుపునిచ్చారు. భద్రాచలం కేంద్రంగా గోండ్వానా న్యాయ కళాశాల ఏర్పాటుకు ఆదివాసీ యువత ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. ఈ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తాటి లక్ష్మయ్య, భీమయ్య, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా సాయి ఎక్సలెంట్ స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలు

జూలూరుపాడు/చండ్రుగొండ(భద్రాద్రి న్యూస్): సాయి ఎక్సలెంట్ స్కూల్లో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు మరియు వినోద కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హుస్సేన్ మాట్లాడుతూ, భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పిల్లలంటే ఎంతో ఇష్టమని, ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ,పట్టుదలతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పిల్లల సర్వతోముఖ అభివృద్ధికి పాఠశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జక్కుల శివకుమారి ,నాగలక్ష్మి, నబీనా, ప్రశాంతి, సత్యవతి, కళ్యాణి, అరుణ, భార్గవి, స్వాతి, అనిత, రిచిత, కృష్ణ వేణి, జమున, మమత, రజిత, హరిత,ణ.రిచిత విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం..

- సింగరేణిలో అభివృద్ధి పథకాల జాతర!

- పత్తి రైతులకు అండగా సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం.. 18,216 మందికి స్మార్ట్ రేషన్ కార్డులు, 791 మందికి చేయూత పింఛన్లు పంపిణీ

- 349 గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

కారేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్ -- రాములు): రైతులకు అండగా నిలవడంతో పాటు పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సింగరేణి మండలంలో శుక్రవారం నిర్వహించిన పర్యటనలో భాగంగా రైతులకు భరోసా కల్పిస్తూ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు వేలాది మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందజేశారు. ఒకే రోజు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో మండలంలో సందడి నెలకొంది.

పత్తి రైతులకు అండగా సీసీఐ కొనుగోలు కేంద్రం

పత్తి రైతులు దళారుల బారిన పడకుండా, తాము పండించిన పంటకు మద్దతు ధర లభించేలా సింగరేణి మండలంలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా పత్తి కొనుగోళ్ల చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

వేలాది కుటుంబాలకు సంక్షేమ ఫలాలు

మండల పరిధిలో 18,216 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, అర్హులైన 791 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పింఛన్లు వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వారికి ఆర్థిక భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.

349 గిరిజన కుటుంబాలకు సొంతింటి కల సాకారం

ఐటీడీఏ ద్వారా మంజూరైన 349 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను గిరిజన కుటుంబాలకు ఎమ్మెల్యే అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఈ పట్టాలు అందడం ఆనందాన్ని కలిగించింది. అర్హులైన పేద కుటుంబాలకు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వైరా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

అధికారులు, ప్రజాప్రతినిధుల హాజరు

ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బి. పద్మ, సింగరేణి సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ వి. రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు, తెలంగాణ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, సొసైటీ డైరెక్టర్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్, అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, భాగ్యనగర్ తండా సర్పంచ్ బానోత్ హీరాలాల్, బానోత్ పద్మరూప్లా నాయక్, పోలంపల్లి సర్పంచ్ హేమలత బాలాజీ, మేదరి వీరప్రతాప్ (టోనీ), మాజీ సొసైటీ చైర్మన్ అడ్డగోడ ఐలయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు సురపు రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ధారావత్ వినోద్ నాయక్, రామ్మూర్తి నాయక్, భీముడు నాయక్, కడియాల సుధాకర్ తదితర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సీసీఐ సిబ్బంది, రైతులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





కోదాడ తమ్మరలో భక్తిశ్రద్ధలతో నాగుల చవితి వేడుకలు

కోదాడ, నవంబర్ 13(భద్రాద్రి న్యూస్): కోదాడ పట్టణ పరిధిలోని తమ్మర నాగేంద్ర స్వామి పుట్ట వద్ద నాగుల చవితి వేడుకలు శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుట్టలో పాలు పోసి స్వామి వార్లకు అభిషేకాలు నిర్వహించి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం సుబ్రమణ్యేశ్వర స్వామి కళ్యాణాన్ని కనుల పండువగ జరిపారు.భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. పదివేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.





రైతులు ఆకాశం వైపు కాదు.. గోదావరి జలాల వైపు చూసేలా చర్యలు చేపట్టాలి!

- సింగరేణి మండలానికి గోదావరి జలాలు అందించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపాలి..

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు వినతి



కారేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్ -- రాములు): సింగరేణి మండల రైతులు సాగునీటి కోసం ఆకాశం వైపు ఎదురుచూడకుండా, గోదావరి జలాలపై ఆధారపడి పంటలు సాగు చేసుకునే పరిస్థితులు కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు కోరారు. ఈ దిశగా వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని గోదావరి జలాలను మండలానికి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కారేపల్లిలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను నాగేశ్వరరావు కలిసి మండలంలోని ప్రధాన సమస్యలను వివరించారు. మండలంలో పోడు సాగు చేసుకుంటున్న గిరిజన, గిరిజనేతర రైతుల భూములను అధికారులు, ఎఫ్ఆర్ కమిటీలు సర్వే చేసినప్పటికీ అర్హులైన పలువురు రైతులకు ఇప్పటికీ హక్కు పత్రాలు అందలేదని తెలిపారు. అర్హులైన రైతులందరికీ హక్కు పత్రాలు అందించి న్యాయం చేయాలని కోరారు. అలాగే సింగరేణి సంస్థ, డోలమైట్ గనుల ప్రభావిత గ్రామాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని పేర్కొన్నారు. ఆయా గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కారేపల్లి ప్రాంత ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడం లేదని, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మండల రైతాంగానికి సాగునీరు, పోడు రైతులకు హక్కులు, గనుల ప్రభావిత గ్రామాలకు అభివృద్ధి నిధులు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని నాగేశ్వరరావు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పాల్వంచలో రహదారులపై పరదాలు, బ్యానర్లతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

- రిలయన్స్ సూపర్ మార్కెట్ మూలమలుపు వద్ద ఆక్రమణలు తొలగించాలి

- మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించాలి : కాల్వ ప్రకాశరావు

పాల్వంచ,నవంబర్ 13(భద్రాద్రి న్యూస్): పాల్వంచ పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నుంచి రిలయన్స్ సూపర్ మార్కెట్ మూలమలుపు మీదుగా ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రహదారిపై పరదాలు, బ్యానర్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం పాల్వంచ అధ్యక్షులు కాల్వ ప్రకాశరావు ఆవేదన వ్యక్తం చేశారు.



ఇప్పటికే రద్దీగా ఉండే ఈ ప్రధాన కూడలిలో రహదారికి ఇరువైపులా పరదాలు, బ్యానర్లు కట్టడం వల్ల రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా, మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు ప్రయాణించే సమయంలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు.

ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించే విధంగా రహదారులను ఆక్రమించడం ఎంతమాత్రం సమంజసం కాదని, మున్సిపల్ నిబంధనలను దృష్టిలో ఉంచుకుని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



మున్సిపల్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని పరిశీలించాలని, రహదారిపై ఏర్పాటు చేసిన పరదాలు, బ్యానర్లను తక్షణమే తొలగించడంతో పాటు మూలమలుపు వద్ద ఉన్న ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కాల్వ ప్రకాశరావు డిమాండ్ చేశారు.ప్రజల భద్రత, సురక్షిత రాకపోకలే ప్రాధాన్యంగా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily
Follow :
@bhadradrinews
శనివారం
14 , నవంబర్ , 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం

జిల్లా స్థాయికి ముచ్చర్ల జాస్తిపల్లి విద్యార్థుల ఎంపిక





కామేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రిన్యూస్):- భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్స్ (ఈఎల్సీ) ద్వారా 9,10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో కామేపల్లి మండలం ముచ్చర్ల జాస్తిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇల్లందు నియోజకవర్గ పరిధిలో జరిగిన ఈ పోటీల్లో వ్యాసరచన ('సరియైన ఓటర్ల జాబితా – ప్రాముఖ్యత / ఓటింగ్ ప్రాముఖ్యత')లో పదో తరగతి విద్యార్థి ఎస్.కె. నేహాన్ పాషా ప్రథమ స్థానం, క్విజ్ (ఓటర్ల జాబితా తయారీ, ఈవీఎం, వీవీప్యాట్, ఎన్నికల ప్రక్రియ) విభాగంలో పదో తరగతి విద్యార్థి డి.ధనుష్ నాలుగో స్థానం సాధించి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. విజేతలకు డిప్యూటీ తహసీల్దార్ బహుమతులు అందజేశారు. విద్యార్థులను ఎంఈవో వెంకట్, ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ సంఘాల నాయకులు ఇరువురు ప్రతిపక్ష మిత్రపక్ష నాయకులు తదితరులు అభినందించారు.

సత్తా చాటిన కామేపల్లి గీతాంజలి స్కూల్ విద్యార్థులు

- జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో సైకిళ్లు కైవసం

- అభినందించిన రాష్ట్ర మంత్రి పొంగులేటి



కామేపల్లి, నవంబరు 13 (భద్రాద్రిన్యూస్):- ఖమ్మం జిల్లా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో కామేపల్లిలోని గీతాంజలి విద్యాలయం విద్యార్థులు సత్తా చాటారు.జిల్లా వ్యాప్తంగా 320 పాఠశాలలు పాల్గొన్న ఈ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు ఎ.ప్రణయ్, కె.వెంకట్ ప్రతిభ కనబరిచి ప్రథమ శ్రేణిలో నిలిచారు. జిల్లా డ్రగ్ కంట్రోలర్ ఆఫీసర్ సోమిరెడ్డి చేతుల మీదుగా విజేతలు రెండు సైకిళ్లను బహుమతులుగా అందుకున్నారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది నందుకు పాఠశాల ఉపాధ్యాయుడు జి.రమేష్ 'ఉత్తమ శిక్షకుడి' బహుమతిని కైవసం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, అడిషనల్ కలెక్టర్ శ్రీజ,ఖమ్మం మాజీ మేయర్ నీరజ తదితరులు పాల్గొని ఆ విద్యాలయం విద్యార్థులను, ఉపాధ్యాయుడిని ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రి పొంగులేటి కి చిత్తారువారి వివాహ ఆహ్వానం

- ఆహ్వాన పత్రిక అందించిన మేకల మల్లి బాబు యాదవ్

- చిత్తారు సింహాద్రి యాదవ్



కామేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రిన్యూస్): తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ఖమ్మంలోని వారి స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షులు చిత్తూరు సింహాద్రి యాదవ్, పొంగులేటి ప్రధాన అనుచరుడు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తో కూడి ఈనెల 15 వ తారీకు ఆదివారం బోనకల్ రోడ్ లోని లక్ష్మీ ఫంక్షన్ హాల్ లో జరగనున్న చిత్తారు సింహాద్రి యాదవ్– మాధవిల కూతురు జోషిత –గురునాథ్ ల వివాహానికి ఆహ్వానం అందించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ తప్పకుండా వచ్చి నూతన జంట ను ఆశీర్వదిస్తానని చెప్పినట్లుగా మల్లి బాబు యాదవ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కన్నెబోయిన సీతారామయ్య, బొర్రా రాజశేఖర్, ఉన్నం బ్రహ్మయ్య, ప్రతాప్, తుప్పాతి రవి పొట్లపల్లి సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు

మర్రిగూడెంలో పరిశుభ్రతే ధ్యేయం

- డ్రైనేజీల వెంట బ్లీచింగ్ పౌడర్ పిచికారీ

- ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ, పంచాయతీల లక్ష్యం

- గ్రామ సర్పంచ్ ఆరెం అచ్చమ్మ



కామేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రిన్యూస్): కామేపల్లి మండల పరిధిలోని కెప్టెన్ బంజర గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గ్రామంలో పారిశుధ్య నిర్వహణను మరింత ముమ్మరం చేశారు.గ్రామంలో వ్యాధులు ప్రబల కుండా, పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా అధికారులు ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగారు.ఇందులో భాగంగా గ్రామంలోని ప్రధాన డ్రైనేజీల వెంట,మురికి నిల్వ ఉండే ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ను విస్తృతంగా చల్లించారు. ?గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పారిశుధ్య ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమతి ఆరెం అచ్చమ్మ స్వయంగా పాల్గొని పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య లోపం వల్లనే అనేక సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, దానిని నివారించేందుకే ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. డ్రైనేజీల్లో నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందిని ఆదేశించినట్లు ఆమె తెలిపారు.

ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం:

కేవలం పంచాయతీ సిబ్బంది వల్లే కాకుండా, గ్రామ ప్రజలందరూ పరిశుభ్రతను తమ బాధ్యతగా భావించాలని సర్పంచ్ పిలుపు నిచ్చారు.ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని,ప్రతి ఒక్కరూ గ్రామ అభివృద్ధికి, ఆరోగ్య పరిరక్షణకు సహకరించాలని కోరారు.?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి విజయ, పంచాయతీ సిబ్బందితో పాటు స్థానిక గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా తదితరులు పాల్గొన్నారు.

36వ కిసాన్ మహాసభలను రైతులు జయప్రదం చేయాలి





కామేపల్లి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):-

ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న 36వ అఖిల భారత కిసాన్ మహాసభల భారీ బహిరంగ సభను రైతులు జయప్రదం చేయాలని కోరుతూ కామేపల్లి మండలంలో రైతు సంఘం నాయకులు గోడపత్రికలు, వాల్ రైటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రైతు సంఘం డివిజన్ కార్యదర్శి దుగ్గి కృష్ణ, సీనియర్ నాయకులు వింజం నాగభూషణం మాట్లాడుతూ.. మహాసభలకు కామేపల్లి మండలం నుంచి భారీగా రైతులను సమీకరించనున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా రైతులందరూ మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని,వారు పిలుపునిచ్చారు రైతుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించి పోరాడాల్సిన సమయం పాలన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాధావత్ శ్రీను, రాయల సత్యనారాయణ, ఏర్పుల శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట..

- వైరాలో సంక్షేమ పథకాల పంపిణీకి శ్రీకారం!

- సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం..

అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు, డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ







కారేపల్లి, భద్రాద్రి న్యూస్: రైతులు, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైరా నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ శ్రీకారం చుట్టారు. ఆయన చేతుల మీదుగా పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. పత్తి రైతులకు మద్దతు ధర కల్పించి, వారి కష్టానికి తగిన గిట్టుబాటు ధర అందించాలనే లక్ష్యంతో అప్పాయిగూడెంలోని జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వ మద్దతు ధరకు పత్తిని విక్రయించుకునే అవకాశం కల్పించడం ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లను పంపిణీ చేసి, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు నూతన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఐటీడీఏ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు సంక్షేమం, పేదల జీవన ప్రమాణాల మెరుగుదల, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఒకే వేదికగా రైతులకు మద్దతు ధర కల్పించే కొనుగోలు కేంద్రం ప్రారంభంతో పాటు వివిధ సంక్షేమ పథకాల పంపిణీ చేపట్టడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

పొలం పల్లి అభివృద్ధికి నిరంతర కృషి..

అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం!

- ఇందిరమ్మ ఇళ్లు, నూతన పింఛన్లు, ఉపాధి హామీ జాబ్ కార్డుల మంజూరుకు ప్రత్యేక చొరవ

- సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ



కారేపల్లి, నవంబర్ 14 (భద్రాద్రి న్యూస్): గ్రామ అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని పొలం పల్లి గ్రామ సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. పొలం పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అర్హులైన నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు, నూతన పింఛన్లు, ఉపాధి హామీ జాబ్ కార్డులు మంజూరు చేయించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను పలుమార్లు కలిసి గ్రామానికి మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు.మంజూరైన ఇందిరమ్మ ఇళ్లతో పాటు కొత్తగా ఇళ్లు పొందేందుకు అర్హులైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తున్నామని చెప్పారు. అదేవిధంగా అర్హులైన వృద్ధులు, నిరుపేదలకు నూతన పింఛన్లు, ఉపాధి కోరుకునే కుటుంబాలకు జాబ్ కార్డులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నామని వెల్లడించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని ఆమె అభినందించారు. తమపై నమ్మకం ఉంచి ఆదరిస్తున్న గ్రామ ప్రజల ప్రేమాభిమానాలు, ఆశీర్వాదాలే మరింత బాధ్యతతో పనిచేసేందుకు ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో పొలం పల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ హేమలత బాలాజీ స్పష్టం చేశారు.

సేవే లక్ష్యం.. సమాజ మార్పే ధ్యేయం!

- మారుమూల గిరిజన గూడేల నుంచి వృద్ధాశ్రమాల వరకు.. నేషనల్ సేవా ఫౌండేషన్ మానవీయ స్పర్శ
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు ప్రధాన సామాజిక సేవా కార్యక్రమాలు
- గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ
- పాఠశాల చిన్నారులకు విద్యా సామగ్రి, చిరుతిళ్లు
- వృద్ధులకు భోజనం, పండ్లు, దుస్తుల అందజేత
- తొమ్మిది ప్రధాన లక్ష్యాలతో సేవా ప్రస్థానం









కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్): సేవ చేయాలనే సంకల్పం ఉంటే అవకాశాలు వాటంతట అవే వస్తాయి.. సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన ఉంటే అడుగులు మారుమూల ప్రాంతాల వైపు సాగుతాయి. ప్రభుత్వ పథకాలు, అధికార యంత్రాంగం తమ వంతు కృషి చేస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా ఎన్నో వర్గాలు కనీస అవసరాలకు దూరంగా ఉన్నాయి. అలాంటి వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో నేషనల్ సేవా ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. గిరిజన కుటుంబాలకు ఆప్యాయత పంచడం నుంచి చిన్నారుల విద్యాభివృద్ధికి తోడ్పడటం, వృద్ధులకు అండగా నిలవడం వరకు మూడు విభిన్న కార్యక్రమాలతో మానవీయతను చాటుకుంది.

– మారుమూల గిరిజన గూడేలకు ఆప్యాయత

చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గుంపులో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాల్లో ప్రత్యేకంగా నిలిచింది. కేవలం 30 కుటుంబాలు మాత్రమే నివసించే ఈ మారుమూల ఆవాసం పట్టణ జీవనానికి దూరంగా ఉంది. కనీస వసతులు, అవసరాల కోసం స్థానికంగా లభించే వనరులపైనే ఆధారపడుతూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు ఫౌండేషన్ ప్రతినిధులు ఆప్యాయతతో చేయూతనిచ్చారు. వస్తువుల పంపిణీతోనే సేవను పరిమితం చేయకుండా, తదుపరి దశలో గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం విశేషం.

– చిన్నారుల చదువుకు ప్రోత్సాహం

పాల్వంచ మండలం కారేగట్టు గ్రామంలోని ప్రీ–ప్రైమరీ పాఠశాల చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు, చిరుతిళ్లు పంపిణీ చేశారు. బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడంతో పాటు పేద కుటుంబాల పిల్లలకు చదువుకు అవసరమైన ప్రాథమిక సామగ్రి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే కాకుండా, వారి విద్యాభివృద్ధికి సామాజిక సంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలనే సందేశాన్ని ఫౌండేషన్ చాటింది.

– వృద్ధులకు ఆత్మీయ భరోసా

అశ్వాపురం మండలంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు భోజనం సమకూర్చడంతో పాటు పండ్లు, చిరుతిళ్లు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కుటుంబాలకు దూరమై వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆహారం అందించడం మాత్రమే కాకుండా, వారితో ఆత్మీయంగా గడుపుతూ ఆదరణ చూపడం ఈ కార్యక్రమంలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించింది. షానాజ్ తన సొంత ఆర్థిక వనరులతో ఈ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు ఆశ్రయం, ఆలనాపాలనా అందిస్తుండటం అభినందనీయమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

– తొమ్మిది లక్ష్యాలతో సేవా ప్రస్థానం

ఈ సందర్భంగా నేషనల్ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చిన్ని బాబు అరిగెల మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమాలు తమ సేవా ప్రయాణంలో తొలి అడుగులని తెలిపారు. సమాజంలోని అవసరంలో ఉన్న ప్రతి వర్గానికి చేరువ కావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్య, బాలల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులకు సహాయం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, యువతకు ఉపాధి నైపుణ్యాలు, మాదకద్రవ్యాల నివారణ, సేంద్రియ వ్యవసాయం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ వంటి తొమ్మిది ప్రధాన అంశాలపై ఫౌండేషన్ పనిచేస్తుందని వివరించారు.

– సమష్టి కృషితో సామాజిక మార్పు



ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాసులు భరత అవినీతి నిరోధక, విజిలెన్స్ కౌన్సిల్ తెలంగాణ చీఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కార్యదర్శి కనూరు శ్రీనివాస్‌తో కలిసి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ట్రస్టీలుగా ఎం.కె. సిను, డాక్టర్ కె.వి.వి. వినీత, జి.ఎస్. జయధీర్, ఎం. జాన్ అరుల్, ఎస్. వీరభద్రరావు వ్యవహరిస్తున్నారు. న్యాయవాదులు ఈ. చంద్రకాంత్, మదన్ మోహన్, సింగం శ్రీధర్‌తో పాటు పి. గణేష్, దుర్గ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

– సేవా కార్యక్రమాలే సామాజిక బాధ్యతకు నిదర్శనం

సమాజంలో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సహాయంతో పాటు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కూడా ఎంతో అవసరం. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, కనీస అవసరాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ సేవా ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలు సేవా సంస్థల సామాజిక బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. ఒక్కరోజు కార్యక్రమాలతో సరిపెట్టకుండా భవిష్యత్తులోనూ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుంది.

లి"నేడు సేవ.. రేపటి సాధికారత" (Service Today, Empowering Tomorrow) అనే నినాదంతో సమాజంలో అర్థవంతమైన మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సేవను బాధ్యతగా, సమాజ అభివృద్ధిని ధ్యేయంగా చేసుకుని నేషనల్ సేవా ఫౌండేషన్ సాగిస్తున్న ప్రస్థానం అభినందనీయం.

మైక్రోసాఫ్ట్ సేవల్లో ఏడు గంటల అంతరాయం



హైదరాబాద్, నవంబరు 13 : ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మైక్రోసాఫ్ట్ 365, ఔట్‌లుక్, టీమ్స్, కోపైలట్ సహా పలు కీలక సేవలు ఏడు గంటలకు పైగా నిలిచిపోయాయి. నవంబరు 13న తలెత్తిన ఈ సాంకేతిక సమస్యతో వేలాది మంది వినియోగదారులు ఇమెయిళ్లు పంపడం, స్వీకరించడం, ఫైళ్లను తెరవడం, కృత్రిమ మేధ సేవలను ఉపయోగించడంలో ఇబ్బందులు పడ్డారు. మైక్రోసాఫ్ట్ 365 అనుసంధాన సేవలపై ఆధారపడిన ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ సేవల పైనా ఈ ప్రభావం పడింది.

ఈ అంతరాయానికి గల కారణాలను పరిశీలించిన మైక్రోసాఫ్ట్ కీలక విషయాలను వెల్లడించింది. ప్రభావిత సర్వర్లలో సురక్షిత అనుసంధానాలు ఏర్పాటు చేసే ప్రక్రియలో సమస్య తలెత్తినట్లు గుర్తించింది. ఈ ప్రక్రియపై అధిక భారం పడటంతో సర్వర్లు వినియోగదారుల అభ్యర్థనలను సకాలంలో ప్రాసెస్ చేయలేకపోయాయని తెలిపింది. మొత్తం వినియోగం పెరగడం వల్ల కాకుండా, సమాచార రవాణాను నిర్వహించేందుకు అందుబాటులో ఉన్న సర్వర్ల సంఖ్య తగ్గడమే సమస్యకు ప్రధాన కారణమని వివరించింది.

డౌన్‌డిటెక్టర్ గణాంకాల ప్రకారం, ఔట్‌లుక్ సేవల్లో అంతరాయంపై ఫిర్యాదులు శుక్రవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో 1,38,058కు చేరాయి. ఉదయం 4.30 గంటల నాటికి ఈ సంఖ్య సుమారు 34,490కు తగ్గింది.

ఎక్స్ఛేంజ్ ఆన్‌లైన్ సేవలో సమస్య కారణంగా వెబ్‌సైట్, కంప్యూటర్, మొబైల్ ద్వారా ఔట్‌లుక్ మెయిల్ ఖాతాలను తెరవడంలో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇమెయిళ్ల చేరవేతలోనూ ఆలస్యం జరిగింది. మైక్రోసాఫ్ట్ 365లో ఇటీవల ఉపయోగించిన ఫైళ్లను తెరవడం, నిర్వాహక కేంద్రంలోని కొన్ని పేజీలను చూడటం కూడా సాధ్యపడలేదు.

కోపైలట్ చాట్ తెరుచుకోకపోవడం, సమాధానాలు అందకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. టీమ్స్‌లో సందేశాలు పంపడం, ఆన్‌లైన్ సమావేశాలు నిర్వహించడం వంటి ప్రధాన సేవలు చాలావరకు పనిచేసినప్పటికీ, క్యాలెండర్లు, సమావేశాల ఏర్పాటు, కొత్త చాట్‌ల సృష్టి వంటి కొన్ని సదుపాయాలు ప్రభావితమయ్యాయి. మైక్రోసాఫ్ట్ ప్లానర్, టు డూ, డిఫెండర్, ప్యూర్‌వ్యూ, ఫ్యాబ్రిక్, పవర్ బీఐ, షేర్‌పాయింట్ ఆన్‌లైన్, విండోస్ 365 సేవల్లోనూ సమస్యలు ఎదురయ్యాయి.

మైక్రోసాఫ్ట్ అనుసంధాన సేవల్లో సమస్య కారణంగా కొత్త కనెక్షన్లు ఏర్పాటు చేయడంలో ఇబ్బందులు ఎదురైనట్లు ఓపెన్‌ఏఐ తెలిపింది. తమ మైక్రోసాఫ్ట్ 365 అనుసంధాన సేవను ప్రభావితం చేస్తున్న సమస్య బాహ్య సేవలందించే సంస్థ వద్ద తలెత్తినట్లు ఆంత్రోపిక్ వెల్లడించింది.

అంతరాయాన్ని తొలగించేందుకు ప్రభావిత మౌలిక సదుపాయాలను పునఃప్రారంభించడంతో పాటు, సర్వర్లలో కాన్ఫిగరేషన్ మార్పులను పరీక్షించినట్లు మైక్రోసాఫ్ట్ తెలిపింది. కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా సమాచార రవాణాపై ఆంక్షలు విధించి, సర్వర్ల పనితీరును పర్యవేక్షించింది. పరిస్థితి మెరుగుపడిన ప్రాంతాల్లో క్రమంగా సేవలను పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ఈ అంతరాయం కారణంగా అమెరికాకు చెందిన విద్యుత్ ట్రక్కుల తయారీ సంస్థ వర్క్‌హార్స్ గ్రూప్ తన మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రకటనను నవంబరు 12 నుంచి 16వ తేదీకి వాయిదా వేసింది. ఇటీవల అజూర్ క్లౌడ్ సేవల్లోనూ అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో, వరుస సాంకేతిక సమస్యలు మైక్రోసాఫ్ట్ సేవల విశ్వసనీయతపై చర్చకు దారితీశాయి.

ఓలాకు రూ.10 లక్షల జరిమానా



హైదరాబాద్, నవంబరు 13 : క్యాబ్ బుకింగ్ సమయంలోనే ప్రయాణికుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేసేలా ప్రోత్సహిస్తున్న ఓలా విధానంపై కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) చర్యలు తీసుకుంది. ఈ విధానాన్ని అన్యాయమైన వ్యాపార పద్ధతిగా, వినియోగదారులను తప్పుదోవ పట్టించే చర్యగా పరిగణిస్తూ ఓలా క్యాబ్ సేవల సంస్థ ఏఎన్ఐ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.10 లక్షల జరిమానా విధించింది. అంతేకాకుండా ఈ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని ఆదేశించింది.

సీసీపీఏ చీఫ్ కమిషనర్ నిధి ఖరే, కమిషనర్ అనుపమ్ మిశ్రా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఓలా యాప్‌లో డ్రైవర్ కోసం అన్వేషిస్తున్న సమయంలో 'టిప్' పేరుతో అదనపు మొత్తం చెల్లించే అవకాశం కల్పించారని అధికారులు గుర్తించారు. ఇలా చెల్లిస్తే త్వరగా క్యాబ్ లభించే అవకాశాలు పెరుగుతాయని యాప్‌లో సందేశాలు ప్రదర్శించేవారు. అనంతరం ఈ ఫీచర్ పేరును 'యాడ్ ఆన్'గా మార్చినప్పటికీ, దాని విధానంలో మాత్రం ఎలాంటి మార్పు చేయలేదని సీసీపీఏ పేర్కొంది.

'టిప్ ఇస్తే త్వరగా రైడ్ లభించవచ్చు', 'త్వరగా రైడ్ నిర్ధారణ కావాలంటే అదనంగా చెల్లించండి' వంటి సందేశాలు వినియోగదారుల్లో అపోహలు కలిగించేలా ఉన్నాయని సంస్థ అభిప్రాయపడింది. అదనపు మొత్తం చెల్లిస్తే క్యాబ్ త్వరగా దొరుకుతుందనే భావన కలిగించడం తప్పుదారి పట్టించడమేనని స్పష్టం చేసింది. సందేశాల్లో 'అవకాశం ఉండొచ్చు' వంటి పదాలు ఉపయోగించినప్పటికీ, వినియోగదారులపై పడే ప్రభావం మారదని పేర్కొంది.

యాడ్ ఆన్ చెల్లింపులు డ్రైవర్‌కు రైడ్ కేటాయించే ప్రక్రియపై ప్రభావం చూపవని ఓలా చెబుతున్నప్పటికీ, యాప్‌లో మాత్రం అదనపు చెల్లింపుతో త్వరగా క్యాబ్ లభించే అవకాశం ఉందని సూచించడాన్ని సీసీపీఏ తప్పుబట్టింది. అంతేకాకుండా యాడ్ ఆన్ చెల్లింపులు ఉన్న రైడ్ అభ్యర్థనలను డ్రైవర్లు తక్కువగా అంగీకరిస్తున్నారనే సమాచారాన్ని వినియోగదారులకు వెల్లడించలేదని గుర్తించింది. సూచించిన అదనపు మొత్తాలను ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తున్నారో కూడా వివరించలేదని పేర్కొంది. ఈ చర్యలు వినియోగదారుల రక్షణ చట్టం 2019లోని సెక్షన్ 2(28)(iv) ప్రకారం కీలక సమాచారాన్ని దాచిపెట్టినట్లేనని తేల్చింది.

సాధారణంగా సేవ పూర్తయిన తర్వాత స్వచ్ఛందంగా ఇచ్చే మొత్తాన్నే టిప్ అంటారు. అయితే ప్రయాణం ప్రారంభం కాకముందే టిప్ చెల్లించేలా ప్రోత్సహించడం ద్వారా స్వచ్ఛంద చెల్లింపును ముందస్తు చెల్లింపుగా మార్చినట్లవుతుందని సీసీపీఏ పేర్కొంది. ఫీచర్ పేరును 'టిప్' నుంచి 'యాడ్ ఆన్'గా మార్చినంత మాత్రాన ఆ విధానం స్వభావం మారదని స్పష్టం చేసింది.

మోజర్లలో నూతన రైస్ మిల్లు ప్రారంభం

పెద్దమందడి,నవంబర్13 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సమీపంలో భీమా భాస్కర్ అండ్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లు ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వామన్ గౌడ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ సహకార అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు భీషం చెన్నకేశవరెడ్డి పాల్గొని నూతన రైస్ మిల్లు యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నూతన పరిశ్రమలు ఏర్పాటు కావడం వల్ల స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో పాటు రైతులకు, ప్రజలకు పరోక్షంగా ప్రయోజనం చేకూరుతుందని ఆకాంక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లు విజయవంతంగా కొనసాగాలని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్,కనిమెట్ట సర్పంచ్ రామచంద్రయ్య యాదవ్, నాయకులు మోహన్ కుమార్, మైబు, నరేందర్ గౌడ్, నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ వెంకట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.



నాగుల చవితి వేడుకలు.. ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- **నాగదేవతకు మహిళల ప్రత్యేక పూజలు.. భక్తిశ్రద్ధలతో పండుగ నిర్వహణ**

జమ్మికుంట, నవంబర్ 13 జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో నాగుల చవితి పర్వదినాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. పండుగను పురస్కరించుకొని ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాగదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు, నాగదేవత పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు పుట్ట వద్ద పసుపు, కుంకుమ సమర్పించి, పాలు పోసి సంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు. తమ కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని నాగదేవతను ప్రార్థించారు. అనంతరం ఆలయాల్లో అర్చకుల చేతుల మీదుగా తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవోలు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.